www.navatelangana.com

# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

1

ఆదివారం 01 జనవరి 2023

## వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా బోధించాలి

నవతెలంగాణ-గుడిహత్నూర్

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన చేయాలని ఐటిడిఏ డిడి దిలీప్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని తోషం గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వంటగదితో పాటు తరగతి గదులను పరిశీలించారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా చదువుకొని వారి కలలను తీర్చాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ప్రధానోపాధ్యాయుడు కనక అభిమాన్‌కు సూచించారు. విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా విద్య బోధన చేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## ఏకలవ్య పాఠశాలను తనిఖీ చేసిన రాష్ట్ర బృందం

నవతెలంగాణ-ఉట్నూర్

ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను శనివారం రాష్ట్ర అధికారులు తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల ప్రదర్శన తరగతులు, ఉపాధ్యాయుల సంబంధించిన రికార్డులు, విద్యార్థుల పరిజ్ఞానాలను పరిశీలించారు. విద్యార్థుల భోజన, లైబ్రరీ, మ్యూజిక్, ఆర్ట్స్, క్రాఫ్ట్, పాఠశాల సంబంధిత రికార్డ్స్‌ను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈఎంఆర్ఎస్ రాష్ట్ర సొసైటీ ఓఎస్డీ శ్రీనివాస్, బృంద సభ్యులు సత్యనారాయణ, బాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలన్నారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించే విధంగా కృషి చేయాలని సూచించారు. విద్యార్థులు నాణ్యమైన కూరగాయలతో భోజనాలు వడ్డించాలని పేర్కొన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. వారి వెంట ఆర్సీఓ గంగాధర్, ఈఎంఆర్ఎస్ ఇంద్రవెల్లి ప్రిన్సిపాల్ అనిల్, ఉట్నూర్ ప్రిన్సిపాల్ విజయ, వైస్ ప్రిన్సిపాల్ గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రాయిసెంటర్ల సేవలు ఆదర్శనీయం

- ఆదిలాబాద్ కలెక్టర్ సిక్తా పట్నాయక్




నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ గూడాల్లో సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన రాయిసెంటర్లు అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శనివారం కుమురం భీం ప్రాంగణంలో గోండ్వాన పంచాయతీ రాయి సెంటర్ 36వ వార్షికోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్‌తో పాటు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె. వరుణ్‌రెడ్డి హాజరయ్యారు. అధికారులకు ఆదివాసీలు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ముందుగా కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి రాయిసెంటర్‌ల ద్వారా చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 120 రాయి సెంటర్లు పని చేస్తున్నాయన్నారు. ఆదివాసీల జీవన విధానంలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. విద్య, నైపుణ్యం, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, రవాణా తదితర సౌకర్యాల కల్పనతో ఆదివాసుల్లో మార్పు సాధ్యమవుతుందన్నారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను రాష్ట్రపతి పర్యటన సందర్భంగా వివరించడం జరిగిందని అన్నారు. కోవిడ్ అనంతరం అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రశాంతంగా జరుగుతున్నాయని తెలిపారు. రాయిసెంటర్‌ల సహకారంతో గిరిజన గ్రామాల్లో అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. పాఠశాలల్లో మన ఊరు- మన బడి కార్యక్రమం కింద పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మరమ్మత్తులు, మౌళిక సదుపాయాలు కల్పించబడుతున్నాయని తెలిపారు. జిల్లాలో సుఖ ప్రసవాలు జరిగేలా వైద్యసేవలు అందిస్తున్నామని, రక్త హీనత కలిగిన గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామని, ఇటీవల కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం, ఉద్యాన పంటల సాగుకు గిరిజన రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తూ వారి ఆర్థిక అభివృద్ధిని పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కె.వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలలో పటేల్‌లు, సార్‌మేడిల సహకారంతో అభివృద్ధి సాధించవచ్చని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు నిలయమని అన్నారు. 200 గిరిజన గ్రామపంచాయితీలను ఆదర్శ పంచాయితీలుగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టార్స్ 50 శిక్షణ కేంద్రంలో విద్యార్థులు ఐఐటి, నీట్ వంటి అత్యుత్తమ విద్యా సంస్థలలో ప్రవేశాలు పొందారని అన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా మరింత కృషి చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉపాధి నైపుణ్య శిక్షణలు, ఆయిల్ పామ్, డ్రాగన్ ఫుడ్, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, పట్టు పరిశ్రమ కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. 300 మంది గిరిజన రైతులకు గిరివికాసం కార్యక్రమం కింద బోరు బావులు, విద్యుత్ మోటార్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం జంగుబాయి జాతరకు సంబంధించిన వాల్‌పోస్టర్లను, ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ దంపతుల 36వ వర్ధంతి సభ కరపత్రాలను కలెక్టర్, పిఓ ఆవిష్కరించారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. ఈ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆదిమ గిరిజన సలహా మండలి చైర్మన్ కనక లక్కేరావు, పీవీటీజీ ఏపీఓ ఆత్రం భాస్కర్, రాయి సెంటర్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులు మెస్రం దుర్గు పటేల్, ఉమ్మడి జిల్లా సార్‌మేడీలు, ఆదివాసుల పెద్దలు, గిరిజనులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సదర్‌మాట్ కెనాల్‌కు గండ్లు

- మరమ్మతు పనుల్లో బయటపడ్డ నాణ్యత లోపం
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

కొత్తపేట్ సమీపంలోని చానల్ 574 వద్ద సదర్‌మాట్ కెనాల్ ఇరువైపుల కట్టలకు గండ్లు పడ్డాయి. రబీ పంటకోసం నీటిపారుదల అధికారులు రెండు రోజుల క్రితం ఆయకట్టుకు సదర్‌మాట్ నీరు విడుదల చేశారు. నీరు వదిలిన మరుసటి రోజునే కెనాల్ కట్టలకు గండ్లుపడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాన కాలంలో కురిసిన వర్షాలకు చానల్ 574 వద్ద అండర్ టన్నెల్ శిథిలమై గండ్లు పడ్డాయి. దీంతో దిగువన రైతులు ఖరీఫ్ పంటకు నోచుకోక నష్టపోయారు. ఈ క్రమంలో రబీ పంట నష్టపోవద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం సదరు గండ్ల మరమ్మతుల కోసం రూ.14లక్షలు మంజూరు చేసింది. సదరు నిధులతో గడిచిన నవంబర్‌లో పనులు చేపట్టి వారం క్రితం పూర్తి చేశారు. శుక్రవారం అధికారులు సదర్‌మాట్ ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. పనుల్లో ఏమాత్రం నాణ్యత లేకపోవడంతో మరమ్మతులు చేసిన చోట తిరిగి గండ్లు పడ్డాయి. పనులను నాణ్యతగా జరిపించాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు చెప్పినా పట్టించుకోలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనుల తీరును పరిశీలిస్తే పాతవాటికే పూతలు వేసినట్టుగా ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు.

# సర్పంచుల రాజీనామా ఉపసంహరణ

- ఆదివాసీ భవనానికి భూమిపూజ



నవతెలంగాణ - వాంకిడి

రెండు రోజుల క్రితం మండలంలోని ఆదివాసీ గిరిజన సర్పంచ్‌లు 18 మంది బీఆర్ఎస్‌కు రాజీనామా చేయడంతో సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జరిపిన చర్చలు సఫలమయ్యాయి. తిరిగి వారందరూ బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి మాట్లాడుతూ ఆదివాసీ సర్పంచుల అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించి ఆదుకుంటామని తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని అభివృద్ధి పనులు, పథకాలు బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అభివృద్ధి కోసమే చిన్నచిన్న గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు మాట్లాడుతూ ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొచ్చినట్టయితే పరిష్కరిస్తామని, ఆదివాసీ సర్పంచ్‌ల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి అన్నివేళల అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ అందరు కలిసికట్టుగా ఉంటేనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆదివాసీ భవనం ఏర్పాటుకు జడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేలు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి భూమిపూజ చేశారు. రూ.21లక్షలతో 15 రోజుల్లో భవనాన్ని పూర్తి చేస్తామని సర్పంచ్‌లకు హామీ ఇచ్చారు. రాజీనామాలు ఉపసంహరించుకొని తిరిగి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు ఆదివాసీ సర్పంచులు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఆదివాసీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మోడల్ పాఠశాలలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలి



**నిర్మల్ :** జనవరి 7లోపు మోడల్ పాఠశాలలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో మన ఊరు మన బడి కార్యక్రమంపై మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముందుగా అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలోని విద్యార్థులలో విద్యా ప్రమాణాలు పెంచడానికి సీఎం మన ఊరు మనబడి పథకం ప్రవేశపెట్టారని అన్నారు. ఈ పథకం మొదటి దశలో మన జిల్లాలో ఎంపికైన 260 పాఠశాలలకు రూ.81 కోట్లు అంచనా వ్యయంతో పనులు ప్రారంభించామని తెలిపారు. మండలానికి రెండు పాఠశాలల చొప్పున మొత్తం 38 మోడల్ పాఠశాలలను ఎంపిక చేసి, వాటి పనులను దాదాపు పూర్తి చేశామన్నారు. ఈ మొత్తం 38 మోడల్ పాఠశాలలను జనవరి 7లోపు ప్రారంభోత్సవానికి పూర్తిగా సిద్ధం చేయాలనీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. 38 మోడల్ పాఠశాలలలో విద్యాశాఖ మంత్రి జనవరి 9న రెండు పాఠశాలలను ప్రారంభించే అవకాశం ఉందని అన్నారు. అధికారులు వీటి ప్రారంభోత్సవానికి పాఠశాలలను రంగులతో అందంగా కనబడునట్లు పూర్తిగా సిద్ధం చేయాలనీ ఆదేశించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఇతర ప్రజా ప్రతినిధులు అందరూ ఏఈలతో కలిసి, మోడల్ పాఠశాలలను సందర్శించి, పనుల ప్రగతిని పరిశీలించాలని అన్నారు. పనులు పూర్తి అగునట్లు శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి డా.ఏ. రవీందర్ రెడ్డి మన ఊరు మనబడి పనులపై నాడు- నేడు ఫోటోలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ, పనుల ప్రగతి వివరాలను వివరించారు. ఇంజనీరింగ్ విభాగ అధికారులతో మోడల్ పాఠశాలల పనుల ప్రగతిని, అంశాల వారీగా, మండలాల వారీగా స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ, ఈ 38 మోడల్ పాఠశాలను జనవరి 7లోపు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సంసిద్ధం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పాఠశాలలను తాను, అడిషనల్ కలెక్టర్లు 38 పాఠశాలలను విభజించుకొని, జనవరి 7న మొత్తం అన్ని పాఠశాలలను ప్రారంభించేందుకు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్‌లు హేమంత్ బోర్కడే, రాంబాబు, మున్సిపల్ చైర్మెన్ ఈశ్వర్, గ్రంథాలయ చైర్మెన్, ఎంపీపీ రామేశ్వర్, ఈఈలు శంకరయ్య, అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## బైరి నరేష్‌పై పీడీ యాక్ట్ కేసు నమోదు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పీడీ చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని అయ్యప్ప సేవా సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. బైరి నరేష్ వ్యాఖ్యలు నిరసిస్తూ శనివారం అయ్యప్ప ఆలయం నుండి అంబేద్కర్ చౌక్ కొరకు బైక్ ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేసి పట్టణ సిఐకి వినతిపత్రం అందజేశారు. గంటపాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకటగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు విశాల్ మాట్లాడుతూ నాస్తికత్వం అనేది ఇంటికి పరిమితం చేయాలి కానీ ప్రజాసభలో ప్రకటించడం ఇతరుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. వెంటనే నరేష్‌పై పీడీ చట్టం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కోశాధికారి చంద్రమోహన్, వ్యవస్థాపకుడు కిషన్, గురు స్వాములు సంతోష్, ప్రతాప్, వినాయక్ పాల్గొన్నారు.

**కౌటాల :** బైరి నరేష్‌ను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని మండల కేంద్రానికి చెందిన అయ్యప్ప స్వాములు, హిందువులు రామాలయం నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు మాట్లాడుతూ హిందూ దేవతలు, అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై పీడీ యాక్టు కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వొజ్జెల మౌనిష్, ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్, బీఆర్ఎస్ నాయకులు, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

**రెబ్బెన :** బైరి నరేష్‌పై పీడీయాక్టు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని శనివారం అయ్యప్ప స్వాములు పీహెచ్‌సీ ఆస్పత్రి నుండి ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కిరణ్‌శర్మ గురుస్వామి మాట్లాడుతూ అయ్యప్ప స్వాముల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

**తాంసి :** హిందూ దేవతలను అవమాన పరిచే విధంగా మాట్లాడిన బైరి నరేశ్‌ను అరెస్ట్ చేసి పీడీ యాక్టు కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం భీంపూర్, తాంసి మండలాలకు చెందిన అయ్యప్ప దీక్ష మాలదారులు ధర్నా నిర్వహించారు. భీంపూర్ మండలంలోని నిపాని కప్పర్ల, పప్పుల్‌కోటి, గ్రామాల అయ్యప్ప భక్తులు కప్పర్ల రహదారిపై, తాంసి అయ్యప్ప భక్తులు సుంకిడి జాతీయ రహదారిపై ఉదయం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ బైరి నరేశ్ ఒక హిందూ మతానికి చెందిన వ్యక్తి అయి ఉండి అయ్యప్పను కించపరిచే విధంగా మాట్లాడం మంచింది కాదని అన్నారు. అలాంటి వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రెండు గంటల సేపు రహదారిపై వాహనాలు నిలిచి పోవడంతో ఎస్సైలు రాధిక, ప్రవళిక, చేరుకొని రాస్తా రోకో విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో సతీష్, కృష్ణ, గోవర్ధన్, పరమేశ్వర్, గణేష్, మహేందర్, ఉన్నారు.

## మద్యం తాగి వాహనం నడపొద్దు : డీఎస్పీ శ్రీనివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డిసెంబర్ 31 వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతమైన వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ శ్రీనివాస్ సూచించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇతరుల మనోభావాలు దెబ్బతినకుండా, ఆకతాయి పనులకు పాల్పడకుండా నడుచుకోవాలన్నారు. మద్యం దుకాణాదారులు ప్రభుత్వం అనుమతించిన సమయపాలన పాటించాలన్నారు. గుంపులు గుంపులుగా గుమిగూడడం, రోడ్లపై కేక్ కటింగ్ చేయడం, వాహనాలపై తిరగడం, అక్రమ సిట్టింగులు, ఆరుబయట మద్యం సేవించడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజల భద్రత దృష్ట్యా డిసెంబర్ 31న పెట్రోలింగ్, పికెట్స్ ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా మద్యం తాగి వాహనాలను నడిపే వారిని కట్టడి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈ తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడిపినట్లు తేలితే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## నేటి నుండి బాసర ఆలయ ఆర్జిత సేవా ధరల పెంపు

నవతెలంగాణ-బాసర

బాసర సరస్వతి అమ్మవారి సన్నిధిలో ఆర్జిత సేవా ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఆదివారం నుండి ఈ ధరలు అమలులోకి రానున్నాయని ఆలయ ఈఓ విజయరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి రుద్రాభిషేకం ధరను రూ.200 నుండి రూ.500కు పెంచుతూ, సాధారణ అక్షరాభ్యాసం రూ.100 నుండి రూ.150, నిత్య చండీ హోమం రూ.1116 నుండి రూ.1516కు, సత్యనారాయణ వ్రతం రూ.100 నుండి రూ.400కు, ప్రత్యేక కుంకుమార్చన రూ.150 నుండి రూ.200కు, అన్నప్రాసన రూ.100 నుండి రూ.200 పెంచుతునట్లు తెలిపారు. భక్తులు గమనించి ఆలయ అధికారులకు సహకరించాలని కోరారు.

## పాఠశాలలో ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల-2లో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌ను విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి కంటె నర్సయ్య ప్రారంభించారు. రకరకాల వంటలను తయారు చేసి ప్రదర్శనతో పాటు అమ్మకాలను చేపట్టారు. ఆహారంలోని పోషకాలను తెలియజేసేలా చార్టులను తయారు చేశారు. తోటి విద్యార్థులు వాటిని కొనుగోలు చేస్తూ వంటకాల రుచులు చూశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బచ్చన్‌సింగ్, స్థానిక నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘం భవనంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం మండలాధ్యక్షుడు దనోర్కర్ వసంత్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ మహారాజ్ నడిచిన సన్మార్గంలో మనమంతా నడవాలని, ఆరె కులస్తులంతా ఐక్యంగా ఉండాలని, సంఘం అభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరె సంక్షేమ సంఘం మండల నాయకులు ఆనంద్‌రావు, బండు, శ్యాంరావు, మధూకర్, బిక్కు, సునీల్, నాగభూషణ్, రాందాస్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుల అరెస్టు

**నార్నూర్ :** చలో ప్రగతి భవన్ ముట్టడి విజవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శివసేన రెడ్డి పిలుపు మేరకు శనివారం ముట్టడికి వెళ్తున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులను ఎస్సై మహేందర్ పోలీసు సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. ముందుగానే కాంగ్రెస్ నాయకులను గృహ నిర్బంధం చేసి ఉదయం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వచ్చే ఎన్నికలలో గెలిచేది కాంగ్రెస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు. అరెస్ట్ అయిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు యూసుఫ్ ఖాన్, నాయకులు కరీం ఖాన్, మాణిక్‌రావు ఆడే, బానోత్ విలాస్ నాయక్, ఎస్‌డీ నిజాం, రమేష్ చునర్కర్, షేక్ నసీర్, సాకీబ్ ఖాన్, మండల, కార్తీక్ రాథోడ్ ఉన్నారు.

## రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

విద్యార్థులో దాగి ఉన్న సృజనాత్మకత, పరిశోధనాసక్తిని వెలికితీసే లక్ష్యంతో సైన్స్ ఫెయిర్ నిర్వహణకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జనవరి 9,10,11 తేదీల్లో మూడు రోజుల పాటు జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ హైస్కూల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్ ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ముందుగా రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 516 మంది విద్యార్థులు, 280 మంది ఇన్‌స్పైర్ విజేతలతో పాటు గైడ్ టీచర్లు పాల్గొననున్నట్లు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ప్రదర్శన కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో సందర్శకులు వచ్చే అవకాశముందని, దానికి తగ్గ ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యార్థులు, సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై ఆదికారులతో చర్చించారు. ప్రదర్శన గదులు, వసతి, భోజనాల ఏర్పాట్లు, ప్రదర్శనల నమోదు, జడ్జిమెంట్, సాంస్కృతిక కార్యక్రమాలు, చేపట్టాల్సిన విధి విధానాలను నిశితంగా ఉండాలని సూచించారు. పోలీసు, అగ్నిమాపక ఇతర సంబంధిత శాఖ అధికారులు సమిష్టిగా పని చేసి ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, గ్రంథాలయ చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, డీఈఓ డాక్టర్ రవీందర్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## బాసర ఆలయంలో ఎంపీ పూజలు



నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవిని శనివారం ఎంపీ సోయం బాపురావు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఎంపీకి ఆలయ అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ఎంపీతో అర్చకులు ప్రత్యేక కుంకుమార్చన పూజలు జరిపించి హారతినిచ్చి ఆశీర్వదించారు. ఆలయ ఈవో విజయ రామారావు ఎంపీని శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ సోయం బాపురావు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బాసర ఆలయం అభివృద్ధిపై చిన్నచూపు చూస్తోందని, ప్రభుత్వం తక్షణమే రూ.50కోట్లు విడుదల చేసి అభివృద్ధి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అనంతరం ఆలయ అతిథి గృహంలో వీడీసీ సభ్యులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం బాసరలో ఏర్పాటుకు కృషి చేయాలని, మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

**పాఠశాలను సందర్శించిన ఎంపీ సోయం**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఎంపీ సోయం బాపురావు సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు పాఠశాల సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎంపీ ప్రధానోపాధ్యాయుడిని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కొరతపై జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డిని ఫోన్‌లో వివరణ కోరారు. బాలుర ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత లేకుండా చూసుకోవాలని సూచించారు. మరో మూడు నెలల్లో విద్యార్థులకు వార్షిక పరీక్షల నేపథ్యంలో సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయులను కేటాయించాలని డీఈఓకు సూచించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్, అంతగిరి రాజన్న, సుభాష్ యాదవ్, సాయినాథ్ ఉన్నారు.

## ప్రమాదాలకు నిలయమైన వాంకిడి రోడ్డు

నవతెలంగాణ - వాంకిడి

మండల కేంద్రంలో నాలుగు వరుసల రోడ్డు నిర్మాణంలో భాగంగా డీబీఎల్ కంపెనీ చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ప్రతిరోజు తవ్వుతుండడంతో వాహనాల రాకపోకలతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. మట్టి రోడ్డు వేయడంతో ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. గత ఏడాది నుండి చేపడుతున్న పనులు ఇప్పటివరకు పూర్తి చేయలేదని, ఇష్టారీతిన తవ్వుతుండడంతో ఇబ్బందులకు గురి కావాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు చెప్పినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని, రోడ్డు ప్రమాదంలో ప్రాణ నష్టం జరిగితే వారే బాధ్యత వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## జూడో క్రీడాకారిణి రమ్యకు ఘన సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రమ శిక్షణతో నిరంతర సాధన చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారధి అన్నారు. శనివారం జిల్లా క్రీడా పాఠశాల విద్యార్థి, జూడో క్రీడాకారిణి సపావత్ రమ్య పటియాలాలోని నేషనల్ సెంటర్ అఫ్ ఎక్సలెన్స్‌కు ఎంపికైన సందర్భంగా శనివారం క్రీడా పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జూడో క్రీడలో జాతీయ స్థాయిలో రెండవ స్థానంలో కొనసాగుతున్న రమ్య ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయి పోటీలకు సైతం అర్హత సాధించింది. ఈ సందర్భంగా కార్యక్రమ అతిథులు సదరు క్రీడాకారిణిని శాలువా, పుష్పగుచ్ఛలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియచేశారు. శిక్షణ కోసం వెళ్తున్న విద్యార్థినికి పలువురు ఆర్థిక సాయం అందచేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ డీఈ మనోహర్, కోచ్‌లు రాజు, రవీందర్, ఇక్బాల్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మంత్రి ఐకే రెడ్డి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని కాల్వ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శనివారం పరామర్శించారు. బీఆర్ఎస్‌వీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు పుజారం మహేష్ తండ్రి పుజారం వెంకట్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన ఆరోగ్య పరిస్థితులను మంత్రి అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ ఆడెపు తిరుమల తల్లి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. మంత్రి వారి ఇంటికి వెళ్లి మృతికి గల కారణాలను తెలుసుకొని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు యు.సుభాష్ రావు, పూండ్రు రమణరెడ్డి, నరసింహ స్వామి దేవస్థాన కమిటీ చైర్మెన్ చిన్నయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగంపై ప్రజలు అవగాహనా కలిగి ఉండాలి

నవతెలంగాణ-కడెం

విద్యుత్ వినియోగంపై ప్రజలు అవగాహనా కలిగి ఉండాలని విద్యుత్ శాఖ ఏఈ సుమన్ అన్నారు. ఆదివారం అంబారిపేట్‌లో విద్యుత్ వినియోగదారులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఏఈ సుమన్ మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలని అన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. విద్యుత్ సమస్యలను అడిగితెలుసుకుని సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించి, తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంబారిపేట్ సర్పంచ్ కొప్పుల లక్ష్మి లచ్చన్న, మల్యాల స్వామి, పాక భూమన్న, మల్యాల వేణు, సిరివెని సత్తన్న, కొప్పుల రవి పాల్గొన్నారు.



## తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని విజయలక్ష్మీ జిన్నింగ్‌తో పాటు పలు ట్రేడర్‌ల దుకాణాలలో తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రానిక్ కాంటాలు, బాట్లను తనిఖీలు చేశారు. తూకంలో తేడాలు రావడంతో వ్యాపారస్తులను హెచ్చరించారు. బాట్లపై స్టాంపింగ్ వేయించారు. ఈ సందర్భంగా ఆ శాఖ అదనపు ఇన్స్‌పెక్టర్ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యాపారస్తులు ప్రతి ఏటా స్టాంపింగ్ చేయించాలన్నారు. తూకంలో మోసం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జలీల్ సిబ్బంది పాల్గొన్నారు.



## టీడీపీలో పలువురి చేరిక

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

మావల మండలంలోని రాంనగర్ కాలనీకి చెందిన పలువురు తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షులు గాలిపెల్లి నాగన్న ఆధ్వర్యంలో శనివారం పలువురు యువకులు టీడీపీలో చేరారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు గుళ్లపల్లి ఆనంద్ యువకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో ముక్త ప్రశాంత్, కొట్టేవార్ సాయి, రంగుల రాజశేఖర్ గౌడ్, శ్రీకాంత్, రాజు, ఆశీర్వాద్, శ్రీనివాస్ రెడ్డి, సూరజ్ కుమార్, తనాజీ, పి.రాజు, మార్కండి, ఉన్నారు. పార్టీ గతంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై నేడుపార్టీలో చేరుతున్నరాని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లూరి రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ పటిష్టత కోసం పాటుపడాలని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. వీరితోపాటు టీడీపీ పట్టణ అధ్యక్షులు ఎండీ రఫీక్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆత్రం జ్ఞానసుధ, ప్రధాన కార్యదర్శి పెరుగు ఆత్మరామ్, తాల్లపెల్లి రాజేశ్వర్, కాడే రాములు, పోతారెడ్డి, జనార్దన్ భారతి, పతిహార ప్రభాకర్, సురేష్ కుమార్, సంతోష్ రెడ్డి, రాజేశ్వర్ రావు, మహబూబ్ బేగ్, షేక్ అహ్మద్, పొచ్చన్న, బుచ్చన్న పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సీఐని కలిసిన వాణిజ్య, వ్యాపార సంఘం ప్రతినిధులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ కె.సత్యనారాయణను పట్టణ వ్యాపారస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఉత్తమ పోలీసు స్టేషన్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ గుర్తింపు పొందిన సందర్భంగా స్టేషన్ సీఐ కె.సత్యనారాయణను శనివారం వాణిజ్య, వర్తకవ్యాపారా సంఘ ప్రతినిధులు కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చాన్ని అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గంద్రత్ సంతోష్ మాట్లాడుతూ సమాజంలో పోలీసుల పాత్ర కీలకమని, ప్రజల్లో పోలీసుల స్నేహపూర్వక వాతావరణం, గౌరవం మరింత పెరుగుతుందన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించినప్పుడే, శాంతి భద్రతలకు ఎటువంటి ఆటంకాలు ఉండవని అన్నారు. మరిన్ని దేశ స్థాయిలో ఉత్తమ అవార్డులు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కమల్ కిషోర్ అగర్వాల్, సలహా కమిటీ చైర్మెన్ రాజేశ్వర్, కార్యచరణ సభ్యులు రాకేష్, శ్రీనివాస్ ఉన్నారు.

## పాఠశాలలో సాహిత్య పుస్తక ప్రదర్శన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రామకృష్ణ మిషన్ 125వ వ్యవస్థాపక ఉత్సవాల్లో భాగంగా శ్రీరామకృష్ణ సేవా సమితి ఆదిలాబాద్ శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఆదిలాబాద్‌లోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శనివారం సాహిత్య పుస్తక ప్రదర్శనతో పాటు అమ్మకాలు చేపట్టారు. ఇందులో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సాహిత్యా పుస్తకాలను కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమానికి సహకరించిన శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాల ప్రిన్సిపాల్ గంగారెడ్డి ఉపాద్యాయ బృందానికి సేవా సమితి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## దేవుళ్లను కించపర్చిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

హిందువుల దేవుళ్లను కించపర్చిన బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించాలని హిందూ వాహిని నాయకులు అన్నారు. శనివారం హిందూ వాహిని ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి, నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హిందూ దేవతలను, అయ్యప్ప స్వాముల మనో భావాలను కించపరుస్తూ మాట్లాడిన ఆయనను ప్రభుత్వం వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి మత ద్వేషాలు చేస్తూ సమాజంలో ఆశాంతిని నెలకొల్పే వ్యక్తులపై కఠినంగా శిక్షించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు.

## పేదలకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-కడెం

క్రిస్మస్ పండుగ 2023 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండలంలోని క్యాథలిక్ చర్చి ఫాస్టర్ ఫాదర్ జోషి ఆధ్వర్యంలో మండలంలోని కన్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని వకీల్‌నగర్ గోండు గూడెం గ్రామాల్లోని గిరిజనులకు, నిరుపేదలకు వృద్ధులకు శనివారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాస్టర్ ఫాదర్ జోషి మాట్లాడుతూ చలికాలాన్ని దృష్టిలో పెట్టుకొని క్రిస్మస్ పండుగ న్యూ ఇయర్ పురస్కరించుకొని నిరుపేదలకు ఉచితంగా దుప్పట్లను అందజేయడం జరుగుతుందని అన్నారు. పేదలకు ఇలాంటి సేవలు చేయడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి సిస్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పాఠశాలలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులు ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు విద్యార్థులు ఒకరికొకరు తెలుపుకున్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినీక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సంస్కృతీ సాంప్రదాయాలకు నిలయాలు

నవతెలంగాణ-ముధోల్

సరస్వతి శిశు మందిరాలు సాంస్కృతి సాంప్రదాయాలకు నిలయాలని ఎంపీ సోయం బాపురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణా భూమిపూజ చేశారు. విద్యార్థులు పట్టుదలతో చదువుతూ క్రమశిక్షణ కలిగి ఉండి అమ్మనాన్న కన్న కలలను సహకారం చేసుకోవాలని అన్నారు. శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు నూతన భవన నిర్మాణం కోసం సామాజికవేత్త బలరాం ప్రసాద్ రెండెకరాల స్థలంతో పాటు పాఠశాల నిర్మాణానికి రూ.30లక్షలు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. బలరాం ప్రసాద్ విద్యాభివృద్ధి కోసం తనవంతు సాయం చేయడం గొప్ప విషయం అన్నారు. తాను ఈ పాఠశాల నిర్మాణం కోసం తన ఫండ్ నుంచి రూ.10లక్షలు మంజూరు చేస్తానని అన్నారు. తాను జనవరి జీతం డబ్బుల నుండి స్వంతగా రూ. లక్ష రూపాయలు విరాళం ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థి దశలోని ఉన్నతమైన లక్షణాలు కలిగి ఉండి సమాజ, దేశ సేవకై ముందుండాలన్నారు. ఈ సందర్భంగా పలువురు దాతలు తమ వంతు సాయాన్ని పాఠశాల భవన నిర్మాణానికి విరాళాలు ప్రకటించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి తనవంతుగా రూ.51 వేలు విరాళంగా ప్రకటించారు. విద్యార్థిని, విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రమాదేవి, సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, సరస్వతి విద్యాపీఠం జేష్ఠ కార్యకర్త, మాశెట్టివార్ దిగంబర్, సరస్వతి విద్యాపీఠ అదిలాబాద్ విభాగ్ అధ్యక్షులు డాక్టర్ దామోదర్ రెడ్డి, విద్యా భారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి, ముధోల్ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్ ఎంపీటీసీ భూమేష్, ప్రముఖ వైద్యులు డాక్టర్ రాజేశ్వర్‌రావు, అడ్వోకేట్ రవిపాండే, అయ్యన్నగారి భూమయ్య, సుదర్శన్, ప్రధాన చార్యులు సారథి రాజు, నామాల భోజన్న, విద్యార్థులు ప్రముఖులు ప్రబంధ కార్యదర్శులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్

నవతెలంగాణ-ఖానాపూర్



పోలీసు నియామక నోటిఫికేషన్‌లో జరిగిన తప్పులను సవరించాలని డిమాండ్ చేస్తు శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లే నాయకులను పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోనికేని దయానంద్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ షబ్బీర్ పాషా, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మాజీ వైస్ ఎంపీపీ తోట సత్యం, యూత్ కాంగ్రెస్ నాయకులు మడిగేల అనిల్, నవీన్ గౌడ్, మోర్తాటి వంశీ, సినియర్ నాయకులు శంకర్ గౌడ్, జహీర్‌లను హైదరాబాద్ వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి, ఖానాపూర్ పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన చేపట్టే అవకాశం కూడా లేకుండా పోలీసులు అక్రమ అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. పోలీసు నియామక నోటిఫికేషన్‌లో జరిగిన తప్పులను సవరించాలని 9 అంశాలతో కూడిన డిమాండ్ చేశారు.

**ఆదిలాబాద్‌టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గంద్రత్ సుజాత ఆరోపించారు. మద్యం షాపులు బంద్ నిర్వహించాలనే డిమాండ్‌తో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళుతున్న ఆమెను శనివారం పోలీసులు ముందస్తుగా జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో హౌజ్ అరెస్టు చేశారు. న్యూ ఇయర్ సందర్భంగా అర్ధరాత్రి వరకు మద్యం షాపులు తెరిచి ఉంచేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ అయిన వారిలో మాజీ సొసైటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకట్, ఉపసర్పంచ్ మల్లయ్య, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాజేశ్వర్, దండు మధుకర్, తుడం వినోద్, ఫైయిమ్, గజానన్ ఉన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం



నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

గ్రామాలలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టి పారిశుధ్యం, పచ్చదనం, చెత్త సేకరణ, డంపింగ్ యార్డ్, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, వైకుంఠధామాలు, గ్రామపంచాయతీలకు ట్రాక్టర్‌లను సమకూర్చడం వంటి కార్యక్రమాలు తీసుకోవడం జరిగిందని అన్నారు. గ్రామాలలో చేపట్టిన కార్యక్రమాలపై గ్రామసభలు నిర్వహించి, ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. ముఖ్య కూడళ్లు, గ్రామపంచాయతీ ముందు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన బోర్డులను ఏర్పాటు చేయాలని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, జిల్లా, మండల పంచాయతీ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆ గ్రామాలలో ఫించన్ దారులకు అందిస్తున్న ఆసరా ఫించన్‌ల సంఖ్య నెల నెల అందిస్తున్న నగదు వివరాలను, రైతుబంధు, రైతు భీమా, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ, పంచాయతీ భవనాల నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ వంటి కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను కూడా బోర్డులపై నమోదు చేయాలని అన్నారు. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామపంచాయతీల ట్రాక్టర్‌ల ద్వారా పంచాయతీ ఆదాయాలు పెరిగాయని అన్నారు. అట్టి నిధుల మేరకు అవసరమైన పనులు చేసుకోవాలని సూచించారు. గ్రామాలలో నిర్మించిన వైకుంఠధామలను వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. వైకుంఠధామానికి వెళ్లడానికి రోడ్లను, ఫెన్సింగ్, నీటి సరఫరా, విద్యుత్, మరుగుదొడ్ల ఏర్పాటు, తదితర మౌళిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలిసేలా బోర్డు ఏర్పాటు చేయాలని అన్నారు. విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని అన్నారు. మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలకు రిజాయిండర్‌లను జారీ చేస్తున్నామని వివరించారు. అనంతరం ఎంపీఓలతో మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని అన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో విధుల్లో ఉండి గ్రామాభ్యుదయానికి, ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. మండల పరిషత్ అధికారులు క్షేత్ర పర్యటన చేసి ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ గణపతి, అదనపు డీఆర్డిఓ రవీందర్ రాథోడ్, ఎంపీఓలు పాల్గొన్నారు.

# ఆర్థిక అసమానతలు ఉన్నంతకాలం ఉద్యమాలు

నవతెలంగాణ-కడెం



ఆర్థిక అసమానతలు ఉన్నంతకాలం విప్లవ ఉద్యమాలు కొనసాగుతాయని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఇటీవల చత్తీస్‌ఘడ్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన సీపీఐ మావోయిస్టు పార్టీ సభ్యురాలు అనితక్కకు నివాళులర్పించి, బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఆర్థిక సమానతలు పెరుగుతున్నాయని అన్నారు. దోపిడీలు పెరిగాయని అన్నారు. దేశ సంపదను, సహజ వనరులను, ప్రభుత్వరంగ పరిశ్రమలను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అమ్మివేస్తోందని అన్నారు. ఆర్థిక అసమానతలను తొలగించుట కోసం పోరాడుతున్న విప్లవ సంస్థలను విప్లవ భావజాలాన్ని అణచివేయుటకు ప్రభుత్వాలు, ఎన్ఐఏ తదితర నల్ల చట్టాలతో నిర్బంధాన్ని కొనసాగిస్తున్నదని పేర్కొన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లతో హత్యాకాండ గావిస్తోందని అన్నారు. అందులో భాగంగానే ఈ బూటకపు ఎన్‌కౌంటర్ జరిగిందని పేర్కొన్నారు. సమాజంలో అసమానతలు ఉన్నంత కాలం విప్లవోద్యమాన్ని అణచివేయాలని అనుకోవడం అవివేకమని అన్నారు. సమసమాజ స్థాపనకు, ఆర్థిక సమానతలకు మార్క్సిజం తప్ప మరో మార్గం లేదని అన్నారు. ఈ మార్గంలో పోరాడుతూ అమరులైన అందరికి విప్లవ జోహార్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జే.రాజు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కె.సర్దార్, జిల్లా ఉపాధ్యక్షులు గోపి, నర్సయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు సునారికారి రాజేష్, లింగన్నలు పాల్గొన్నారు.

# టీఎస్‌యూటీఎఫ్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నిర్మల్

టీఎస్‌యూటీఎఫ్ నూతన జిల్లా కమిటీని రాష్ట్ర పరిశీలకులు ఏ.వెంకట్, లక్ష్మణరావు, ఎన్నికల అధికారి రాష్ట్ర బాధ్యులు సత్యానంద్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. శుక్రవారం రాత్రి పెన్షనర్ భవనంలో నిర్వహించిన జిల్లా మహాసభలలో ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షులుగా దాసరి శంకర్, ప్రధాన కార్యదర్శిగా పెంట అశోక్, ఉపాధ్యక్షులుగా ఏ. మనోహర్‌రెడ్డి, ఏ.సుజాత, కోశాధికారిగా కుర్మే నాగయ్య, కార్యదర్శులుగా ఏ.రమేష్, ఎన్.బక్కన్న, జె. రాజేందర్, పి. మురళిధర్, ఎస్‌కే. ఫాజిల్, వి.రాజేందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌లుగా ముడారపు పరమేశ్వర్, భూమన్న, ఎండీ.అస్లం సోషల్ మీడియా కన్వీనర్‌గా కృష్ణ, కల్చర్ కమిటీ కన్వీనర్‌గా గట్టు శ్రీనివాస్, అకాడమిక్ కమిటీ కన్వీనర్‌గా ఏ.లక్ష్మణ్, స్పోర్ట్స్ కమిటీ కన్వీనర్‌గా అనిల్ కుమార్, రెసిడెన్షియల్ కమిటీ కన్వీనర్‌గా జి.అనిల్ ఎన్నికయ్యారు.

# లింగి వృద్ధాశ్రమాన్ని సందర్శించిన లిటిల్ స్టార్ హై స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-తలమడుగు



జిల్లా కేంద్రంలోని లిటిల్ స్టార్ హై స్కూల్ విద్యార్థులు శనివారం లింగి వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఏడో తరగతి తెలుగు వాచకంలో నాయనమ్మ పాఠంలో అంశం ఉండటంతో స్వయంగా వృద్ధాశ్రమానికి విద్యార్థులు చేరుకొని వృద్ధులతో ముచ్చటించారు. ఏ ఊరు ఎందుకొచ్చారు. కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదా అంటూ వృద్ధులతో వారి బాధలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయురాలు స్వరూప మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో వృద్ధులతో మాట్లాడగా అనేక సాధకబాధలు వృద్ధులు వివరించగా మనసు చలించి పోయిందని అన్నారు. నేడు వయసున్న యువతి, యువకులు రేపు వారు కూడా వృద్ధాప్యం వస్తుందన్నారు. వృద్ధుల పట్ల ప్రేమానురాగాలు కలిగి ఉండాలని కోరారు. దేశంలో వృద్ధ ఆశ్రమాలు లేకుండా చూడాల్సిన బాధ్యత సమాజంతో పాటు అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో లిటిల్ స్టార్ హై స్కూల్ ప్రిన్సిపాల్ కమలాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుమలత, ఉపాధ్యాయులు స్వరూప, జయంతి, జ్యోతి నారాయణ వృద్ధులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కార్మికులకు నూతన దుస్తుల పంపిణీ

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గ్రామపంచాయతీ కార్మికులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. శనివారం కడెం కల్వరి ఆశీర్వాద ప్రార్ధన గోపురం పాస్టర్ పాల్ కరుణాకర్ ఆధ్వర్యంలో సర్పంచ్ కొండాపురం అనూష లక్ష్మణ్ చేతుల మీదుగా గ్రామపంచాయతీ కార్మికులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాల్ కరుణాకర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వార్డు సభ్యులు స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలానికి చెందిన ఇద్దరు బాధితులకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. లక్ష్మణచాంద గ్రామానికి చెందిన ముత్తవ్వకు రూ.31వేలు, మల్లాపూర్ గ్రామానికి చెందిన గంగయ్యకు రూ.55 వేల చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి కష్టాల్లో రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. బాధితులు ధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్, మాజీ ఎంపీపీ కేశం రమేష్, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మండల ఇన్‌చార్జి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జెడ్పీ చైర్మెన్‌ను కలిసిన మహారాష్ట్ర నాయకులు



నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

బీఆర్ఎస్ పార్టీని మహారాష్ట్రలోకి ఆహ్వానిస్తూ ఆదిలాబాద్ జెడ్పీచైర్మెన్ జనార్దన్ రాథోడ్‌ను మహారాష్ట్రకు చెందిన ప్రముఖ నాయకులు ఆత్మీయంగా కలిశారు. ఆదిలాబాద్‌లోని జెడ్పీ కార్యాలయంలో శనివారం ఆదిలాబాద్ జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్‌ను కలిసి ఇటీవల జాతీయ పార్టీగా అవతరించిన బీఆర్ఎస్ పార్టీని మహారాష్ట్రలో ఆహ్వానిస్తున్నట్లు ఆత్మీయంగా కలిశారు. జెడ్పీచైర్మెన్‌ను కలిసిన వారిలో మహారాష్ట్ర కిన్వట్ తాలూకాకు చెందిన నాయకులు జాదవ్ విఠల్, శ్యాంరావ్ నాయక్, జాదవ్ దిలీప్ నాయక్, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరి బాయి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మర్సకొల తిరుపతి ఉన్నారు.

## విద్యార్థులు సామాజిక బాధ్యతతో ఉండాలి : డీడీ

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

విద్యార్థుల్లో సామాజిక బాధ్యతలు పెంచేలా స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతోగానో ఉపయోగపడతాయని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దిలీప్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని కోలాం ఆశ్రమ పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను అయన ప్రారంభించారు. ముందుగా స్కౌట్స్ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులకు పలు విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా స్కౌట్స్ దుస్తులను విద్యార్థులను పంపిణీ చేశారు. జిల్లాలోని 16 ఆశ్రమ పాఠశాలల్లో స్కౌట్స్ యూనిట్లను ప్రారంభించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్థసారథి, ఏటీడబ్ల్యూఓ నిహారిక, స్కౌట్ అండ్ గైడ్స్ కోఆర్డినేటర్లు యాదవ్, శాస్త్రి, ప్రధానోపాధ్యాయులు నారాయణరావ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్ నటరాజన్

నవతెలంగాణ-ఆదిలాబాద్ కలెక్టరేట్

జిల్లాలో పత్తి రైతులు తమ పంటను విక్రయించుకునే క్రమంలో వారు మార్కెట్‌లో మోసపోకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ నటరాజన్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించారు. రైతులు మార్కెట్‌కు తెచ్చిన పత్తిలో నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఏడీ శ్రీనివాస్, నాయకులు కె.రాజు, సిబ్బంది శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

## బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా అజయ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యునిగా తోట అజయ్ కుమార్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ శనివారం నియమించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు నియామక పత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. తనపై నమ్మకంతో జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియమించిన జిల్లా అధ్యక్షుడితో పాటు ఎంపీ సోయం బాపురావు, రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌లకు అజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

## సాంస్కృతిక కార్యక్రమాల్లో జామడ ఆశ్రమ విద్యార్థినులు



నవతెలంగాణ-నార్నూర్

గొండ్వానా పంచాయతీ రాయి సెంటర్ అధ్వర్యంలో శనివారం 36వ వార్షికోత్సవం ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించారు. ఈ మహాసభలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమంలో జామడ ప్రభుత్వ గిరిజన బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఐటీడీఏ పీఓ వరుణ్‌రెడ్డి ఐటీడీఏ పాలకమండలి చైర్మెన్ కనక లక్కేరావు అభినందించినట్టు పాఠశాల పీడీ విశ్వనాథ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రాయి సెంటర్ జిల్లా సార్మేడి దుర్గు పటేల్, వివిధ గ్రామ పంచాయతీల సార్మేడిలు పాఠశాల హెచ్‌ఎం నెహ్రూ, ఉపాద్యాయ సిబ్బంది పుష్పలత, చంపావతి, మల్కు ఉన్నారు.

అనునిత్యం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 01 జనవరి 2023


## సామాజిక విలువలతో కూడిన పత్రిక నవతెలంగాణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సమాజంలో జరిగే ఘటనలతోపాటు విశ్లేషణాత్మక కథనాలు ప్రచురిస్తూ సామాజిక విలువలతో కొనసాగుతున్న పత్రిక నవతెలంగాణ అని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, తహశీల్దార్ ప్రమోద్ అన్నారు. నవతెలంగాణ 2023 క్యాలెండర్లను శనివారం డీఎస్పీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ఎల్లప్పుడు నిజాలను నిర్భయంగా రాసే నవతెలంగాణ దినపత్రిక ప్రజల్లో మంచి ఆదరణ పొందిందన్నారు. నవతెలంగాణ పత్రిక ప్రజల మన్ననలు పొందుతూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పత్రికా యాజమాన్యానికి, సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్‌టౌన్ సీఐ రవీందర్, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (327) జిల్లా కార్యదర్శి ఎమ్మాజీ సతీష్, నవతెలంగాణ ఆర్సీ ఇన్‌చార్జి తాళ్లపల్లి సురేందర్, రిపోర్టర్ కోడం శ్రీకాంత్, డివిజన్ ఇన్‌చార్జి మన్నె యాదగిరి పాల్గొన్నారు.

## చెట్ల నరికివేతను అడ్డుకున్న వీఎస్ఎస్ సభ్యులు

నవతెలంగాణ-భీమారం

గతంలో వన సంరక్షణ సమితీ అటవీ శాఖ సమన్వయంతో నాటిన నీలగిరి చెట్లను అధికారులు కనీస సమాచారం లేకుండా నరికి వేయడం బాధాకరమని విఎస్ఎస్ కమిటీ సభ్యులు శనివారం ఆందోళనకు దిగారు. గత కొన్నేండ్ల క్రితం వన సంరక్షణ సమితి ఫారెస్ట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ప్రస్తుత రైతు వేదిక సమీపంలో గల రక్షిత అటవీ ప్రాంతంలో సుమారు 230 హెక్టార్లలో నీలగిరి మొక్కలను నాటినట్లు తెలిపారు. అప్పటి ఒప్పందం ప్రకారం చెట్ల నుంచి వచ్చే ఆదాయంలో వీఎస్ఎస్ కమిటికీ 50 శాతం వాటా ఉంటుందని తెలిపారు. కానీ అధికారులు మాత్రం కమిటీ సభ్యులకు కనీస సమాచారం లేకుండా, ఇతర రాష్ట్రాల నుంచి తెప్పించిన కూలీలతో చెట్లను నరికివేయడం బాధాకరమని ఆరోపించారు. తమ వాటాతో పాటు మొక్కల ఎదుగుదలకు తమ వంతు పాత్ర ఎంతో ఉందన్నారు. ఎంతో కాలంగా ఆధారపడి ఉన్న తమకు ఉపాధికూడా కల్పించకుండా అధికారులు ఇలా చేయడం అన్యాయమని ఆవేధన వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని సమాచార హక్కు చట్టం సభ్యులు తహసీల్దార్ మల్లికార్జున్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షుడు కొండగొర్ల కమలాకర్ మాట్లాడుతూ మండల, గ్రామస్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల ముందు సెక్షన్(4) ప్రకారం స్థానిక అధికార భాషలో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమాచార బోర్డులు లేనందున దరఖాస్తుదారులు సహ చట్టం కింద దరఖాస్తు ఎవరికి చేయాలో అర్థంకాక ఇబ్బందులు పడే అవకాశముందన్నారు. సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్4(1) బి ప్రకారం స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన 17 అంశాల సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. స్వచ్ఛందంగా సమాచారం ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే సహచట్టం కింద దరఖాస్తులు తగ్గుముఖం పట్టే అవకాశముందన్నారు. కార్యక్రమంలో సమాచార హక్కు రక్షణ చట్టం 2005 జిల్లా అధ్యక్షుడు గజ్జెల్లి సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సందీప్, మండల కమిటీ సభ్యులు అజయ్, కేదారి, నరేష్ పాల్గొన్నారు.

## క్రీడా పోటీలను ప్రోత్సహించాలి

నవతెలంగాణ-మంచిర్యాల

క్రీడా పోటీలను అందరూ ప్రోత్సహించాలని మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య అన్నారు. శనివారం పల్లపు మల్లమ్మ వెంకటి జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ పోటీలు గ్రీన్ సిటీలో జరిగాయి. ఈ పోటీలను ప్రారంభించి విజేతలకు చైర్మన్ పెంట రాజయ్య బహుమతులు అందజేశారు. క్రీడాకారులను అందరూ ప్రోత్సహించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లె భూమేష్, సింగిల్ విండో చైర్మన్ సందెల వెంకటేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు పల్లపు తిరుపతి, నాయకులు బొలిశెట్టి కిషన్, కొండలరావు, హరికృష్ణ, కారుకూరి చంద్రమౌళి, బెల్లంకొండ మురళీ పాల్గొన్నారు.

## అనారోగ్యంతో జీపీ కార్మికుడు మృతి

నవతెలంగాణ-జైనూర్

కొన్ని రోజుల నుండి అనారోగ్యంతో మండలంలోని మాణిగూడ గ్రామ పంచాయతీ కార్మికుడు(కామాటి) సిడాం ప్రభు(26) మృతి చెందినట్టు సర్పంచ్ పూసం రాము తెలిపారు. కొన్నేండ్ల నుండి మాణిగూడ గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ కార్మికుడిగా పనిచేసి మంచి పేరు తీసుకొచ్చారని గుర్తు చేశారు. ఆస్పత్రుల్లో చూపించినా ఆరోగ్యం మెరుగుపడలేదన్నారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు పేర్కొన్నారు. ఆయన మృతిపట్ల కుటుంబానికి సర్పంచ్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. గ్రామపటేల్, దేవారీ, నాయకులు, పంచాయతీ సెక్రటరీ అంకూశ్ కార్మికుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

## చెప్రాడకు పాదయాత్ర

నవతెలంగాణ-కౌటాల

మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా చెప్రాడ ప్రశాంతిదామ్ కార్తీక్ మహారాజ్ ఆలయానికి మంచిర్యాల జిల్లా నుండి ఈ నెల 29న భక్తులు పాదయాత్రగా బయలుదేరి శనివారం మధ్యాహ్నం కౌటాలకు చేరుకున్నారు. మండలకేంద్రానికి చెందిన బోనగిరి సుధాకర్, బోనగిరి శ్రావణ్ జ్ఞాపకార్థం పాదయాత్ర భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. పాదయాత్ర భక్తులు భోజనాలు చేసి అక్కడి నుండి ప్రాణహిత నది దాటి రాత్రి ప్రశాంతిదామ్ కార్తీక్ మహారాజ్ సన్నిధానానికి చేరుకోనున్నారు. ఆదివారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తిరుగు ప్రయాణం కానున్నట్టు పాదయాత్ర భక్తులు పేర్కొన్నారు.

## ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులు ప్రారంభం

నవతెలంగాణ-రెబ్బెన

శనివారం సోనాపూర్‌లో ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను బెల్లంపల్లి ఏరియా సేవా సమితి సభ్యురాలు జి స్వరూపరాణి దేవేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వృత్తి శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకుంటే భర్తకు తోడుగా కుటుంబ పోషణలో భాగస్వాములు కావచ్చన్నారు. మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు సింగరేణి సంస్థ సేవా సమితి ద్వారా వృత్తి శిక్షణలైన జూట్ బ్యాగులు, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, డ్రైవింగ్ శిక్షణను ఇప్పిస్తుందన్నారు. సక్రమంగా తరగతులకు హాజరైతే పూర్తిస్థాయిలో వృత్తి శిక్షణ కోర్సుల్లో నైపుణ్యం సంపాదించవచ్చన్నారు. భార్యాభర్తలిద్దరు సంపాదించే కుటుంబం సమాజంలో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం ఏరియా సేవా సమితి సభ్యులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గోలేటి సర్పంచ్ పోటు సుమలత శ్రీధర్‌రెడ్డి, సీనియర్ సేవా సమితి సభ్యురాలు సొల్లు లక్ష్మి, శంకరమ్మ, ప్రసాదిని రాజాజీ, పద్మస్వామి, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ జీకె కిరణ్‌కుమార్, శిక్షకురాలు శ్రీదేవి పాల్గొన్నారు.

## క్రీడా మైదానంలో సౌకర్యాలపై గని మేనేజర్‌కు వినతి

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కోమటిచేను గ్రామ పంచాయతీ క్రీడా మైదానంలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ కాసిపేట 2 ఇంక్లైన్ గని మేనేజర్ రవీందర్‌కు క్రీడాకారులు వినతిపత్రం అందజేశారు. కోమటిచేను శివారులో ఉన్న సింగరేణి కాసిపేట 2 గనిలో పంచాయతీ నుంచి సింగరేణి భూ నిర్వాసితులు ఉన్నారని వివరించారు. క్రీడా మైదానం కూడా సింగరేణి స్థలంలోనే కోమటిచేను పంచాయతీకి కేటాయించారని, తమకు పంచాయతీలో సదుపాయాలు కల్పించాలని కోరారు. క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్, మైదానం చుట్టూ వీధి దీపాలు, క్రీడా సామాగ్రి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంజెంకి శ్రీనివాస్, ఉప సర్పంచ్ దుర్గం సూర్యప్రకాష్, కాసిపేట 2 గని జీవీజీకేఎస్ ఫిట్ సెక్రెటరీ దొరుకూరి తిరుపతి, కోమటిచేను క్రీడాకారులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-భీమారం

పీఆర్‌టీయూ నూతన కాలెండర్‌ను మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె శంకర్, అధ్యక్షులు బిల్లా తిరుపతయ్యలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలతో పాటు విద్యా వవస్థలో ఎప్పటికప్పుడు నూతన ఒరవడుల ఆధ్యాయనానికై ప్రభుత్వ సమన్వయానికి కృషి చేస్తుందని అన్నారు.

## బైరి నరేశ్ పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బైరి నరేష్‌పై అయ్యప్ప స్వాములు ఫిర్యాదు చేశారు. ముందుగా దేవాపూర్ గ్రామంలోని కాలనీల్లో స్వాములు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# శేష జీవితాన్ని ఆనందంగా గడపండి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పదవి విరమణ పొందిన సింగరేణి కార్మికులు తమ శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆశిస్తున్నట్లు ఆర్‌కె-1ఏ గని మేనేజర్ శ్రీధర్ రావు అన్నారు. శనివారం ఆర్‌కె-1 ఏ గని పై పదవి విరమణ పొందిన ఉద్యోగులకు గని యాజమాన్యం ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గని సేఫ్టీ ఆఫీసర్ బి.జయంత్ కుమార్, గని వెంటిలేషన్ ఆఫీసర్ ఎం.వెంకటేష్, గని పిట్ ఇంజనీరు ఎం.సతీష్, సీనియర్ అండర్ మేనేజర్ దిలీప్ కుమార్, జనరల్ షిఫ్ట్ ఓవర్ మేన్ నెల్లి సదయ్య, ఏఐటియూసీ ఏరియా బ్రాంచ్ సెక్రటరీ ఇప్పకాయల లింగయ్య, టీబీజీకేఎస్ ఏరియా నాయకులు కె.సుదర్శన్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ ఎస్.నయ్, టీబీజీకేఎస్ పిట్ సెక్రటరి బండారి బిక్షపతి పాల్గొన్నారు.

**నస్పూర్ :** శ్రీరాంపూర్ ఏరియాలోని జీఎం కార్యాలయం ఫైనాన్స్ డిపార్ట్మెంట్‌లో పనిచేసిన రఘుపాల్, ఎస్ఆర్ పి3,ఆర్కే-న్యూటెక్, ఆర్కే7 గనులలో పనిచేసి పదవీ విరమణ పొందిన కార్మికులను జీఎం బి.సంజీవరెడ్డి, గనుల మేనేజర్లు సంతోష్ కుమార్, స్వామిరాజు, ఇన్‌చార్జి మేనేజర్ రవి శంకర్ శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ తదుపరి జీవితాన్ని ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అలాగే పదవి విరమణ తర్వాత వచ్చిన డబ్బులను జాతీయ బ్యాంకులో పొదుపు చేసి భావి జీతం ప్రశాంతంగా గడపాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, ఎస్ఓ టు జీఎం త్యాగరాజు పాల్గొన్నారు.



నస్పూర్‌లో..

**కాసిపేట :** మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిలో పదవి విరమణ పొందిన ఉద్యోగులకు గని అధికారులు, యూనియన్ నాయకులు, ఉద్యోగులు ఘనంగా సన్మానం చేశారు. పదవి విరమణ పొందిన దుర్గం పాపయ్య, ముంజాల సారయ్య, చదువుల నాగయ్య, ముక్కెర రాములులను శాలువాలతో ఘనంగా సన్మానం చేసి ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో గని మేనేజర్ అల్లావుద్దీన్, రక్షణాధికారి సునీల్ కుమార్, ఇంజనీర్లు బాబు, మధూకర్, సంక్షేమాధికారి గౌస్ జీషాన్, యూనియన్ నాయకులు దాగం మల్లేష్, బైరి శంకర్, సొల్లంకి శ్రీనివాస్, బెల్లం అశోక్, బియ్యాల వెంకటస్వామి, మీనుగు లక్ష్మీనారాయణ, బన్న లక్ష్మణ్ దాస్, బండారి రమేశ్, రవి పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు మెరుగైన వసతులు




నవతెలంగాణ-తాండూర్

రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తోందని, వానిటి వినియోగించుకుని విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని బెల్లంపల్లి మున్సిప్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత విద్యార్థులకు సూచించారు. శనివారం బెల్లంపల్లి(సిఓఈ)లో విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన షూస్, సాక్సులు, బెడ్ షీట్స్, ఐడీ కార్డ్, బెల్ట్ వంటి వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం ప్రిన్సిపల్ ఐనాల సైదులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు తగినంత ప్రాధాన్యతనిస్తూ నిరుపేద వర్గాలకు నాణ్యమైన విద్యతోపాటు ఉత్తమ సౌకర్యాల కల్పనపై ద్రుష్టి పెడుతుందన్నారు. అదిశగా సంక్షేమ గురుకులాలను వెయ్యికిపైగా ఏర్పాటుచేసి దేశానికే ఆదర్శంగామారిందన్నారు. గురుకులాల్లోని విద్యార్థులు సౌకర్యవంతంగా ఉండడానికి కావలసిన వస్తువులను ప్రతి సంవత్సరం అందజేస్తూ విద్యార్థుల సంక్షేమానికి వెనకడుగు వేయకుండా ముందుకు పోతుందని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల సుదర్శన్,షేక్ అస్మా యూసఫ్, వైస్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్, ఉపాధ్యాయులు వరమని ప్రమోద్ కుమార్, ఆర్.రామారావు, వామన్, శివ, గణపతి, స్రవంతి, తిరుపతి, దుర్గం రమాదేవి, కామెర ప్రేమలత, తేజ, యాంసానిహారిక, చంద్రశేఖర్, సభియాభాను, భోగ అశోక్, మిట్ట రమేష్, ఆకినేపల్లి రాజేష్, గాజుల రాజేందర్, విజయ్, అవునూరి రవి పాల్గొన్నారు.

# సైన్స్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థులను సిద్ధం చేయాలి

- గిరిజన సంక్షేమ శాఖ డీడీ మణెమ్మ

నవతెలంగాణ-ఆసిఫాబాద్




జనవరి 4వ తేదీన నిర్వహించే జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థులను సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు మణెమ్మ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పీఎంఆర్సి కార్యాలయంలో ఎగ్జిబిషన్ నిర్వహణ సన్నాహక కమిటీ సభ్యులతో ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో దాగి ఉన్న సజనాత్మక నైపుణ్యాన్ని వెలికితీయడానికి జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ జనవరి 4వ తేదీన ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఏటీడీఓల పర్యవేక్షణలో ఏటీడీఓ డివిజన్ కేంద్రాలైన ఆసిఫాబాద్, జైనూర్ కాగజ్‌నగర్ కేంద్రాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లాలోని 46 ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు ఆరు అంశాలపై ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారని తెలిపారు. వీటిలో భాగంగా 1 హెల్త్ న్యూట్రిషన్ అండ్ క్లీన్లినేస్, 2 రిసోర్స్ మేనేజ్మెంట్, 3 అగ్రికల్చర్ అండ్ ఫుడ్ సేఫ్టీ, 4 మ్యాథమెటిక్స్ ఆఫ్ క్వాలిటీ లైఫ్,5 సోషల్ యుటిలిటీ ప్రొడక్ట్స్ అంశాలలో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసిఫాబాద్ డివిజన్‌లో 84 ప్రాజెక్టులు, కాగజ్‌నగర్ డివిజన్ 66 ప్రాజెక్టులు జైనూర్ డివిజన్‌లో 78 ప్రాజెక్టు నమోదయినట్లు వెల్లడించారు. మొత్తం జిల్లాలో 228 ప్రాజెక్టులో విద్యార్థులు ప్రదర్శించనున్నట్లు వివరించారు. ఈ డివిజన్ స్థాయిలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థినీ విద్యార్థులను అంశాలవారిగా ఇద్దరిని ఎంపిక చేసి జనవరి 10వ తేదీన ఉట్నూర్ కేంద్రంలో నిర్వహించనున్న ఐటీడీఏ లెవెల్ నాలుగు ఉమ్మడి జిల్లాల సైన్స్ ఎగ్జిబిషన్ ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్ విజయవంతం చేయడానికి సమిష్టిగా అందరి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎసిఎంఓ ఉద్ధవ్, ఏటీడీఓలు కమ్మర్ హుస్సేన్, పురుషోత్తం శకుంతల, కమిటీ సభ్యులు డి.శ్రీనివాస్, స్వర్ణలత, సీహెచ్ ప్రసాద్, ప్రీతి, మహేష్, సోనేరావు, వామన్ రావు పాల్గొన్నారు.

# శత జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-తాండూర్




ఈ నెల 9న హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే బీమ్‌రెడ్డి నరసింహారెడ్డి శతజయంతి వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐఎంయూ జిల్లాకార్యదర్శి సబ్బని కృష్ణ కోరారు. శనివారం బెల్లంపల్లిలో శత జయంతి ఉత్సవాలకు సంబందిచిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటాల్లో రైతాంగ సాయుధ పోరాటం ఒకటని, ఆ పోరాటం దేశ రాజకీయ సామాజిక వ్యవస్థ సమూలమైన మార్పుకు దారితీసిందని అన్నారు పోరాటం నడిపిన ఆరుగురు అగ్ర నాయకులలో భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి ఒక్కరని తెలిపారు. భూస్వామ్య కుటుంబంలో 1922 మార్చి 15న కరివిరాల కొత్తగూడెం భీమిరెడ్డి చుక్కమ్మ రాంరెడ్డి దంపతులకు మొదటి సంతానంగా నరసింహారెడ్డి జన్మించారన్నారు. నిజాం గుండాలకు వ్యతిరేకంగా పోరాడి వేలాది ఎకరాలను పేదలకు పంచిన మహనీయుడు బీఎన్ అని తెలిపారు, ఆయన 1957,1967 రెండుసార్లు శాసనసభ సభ్యునిగా,1971, 1984,1991 లో మిర్యాలగూడ నుండి పార్లమెంటు సభ్యునిగా నీరాజనాలు పడుతూ ప్రజలు గెలిపించారని తెలిపారు. ఆయన ఘనతను బాహ్య ప్రపంచానికి చాటుతూ ఈ కార్యక్రమంలో భాగంగానే 2023 జనవరి 9న హైదరాబాద్ బాగ్ లింగంపల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం10 గంటల నుండి సాయంత్రం 5:30 వరకు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తి- రాజకీయ సామాజిక అంశాలపై బి.ఎన్ ప్రభావం అనే అంశంతో బి.ఎన్ శతజయంతి వార్షికోత్సవ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వామపక్ష,

సామాజిక పార్టీల నాయకులతో పాటు మేధావులు, రచయితలు కవులు, కళాకారులు, బీఎన్ సహచరులు ఆయన కుటుంబసభ్యులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్బని రాజేంద్రప్రసాద్, పసులేటి వెంకటేష్, ఆకాష్, వంశీ, బండి మల్లేష్, రాజయ్య, వెంకన్న, శంకర్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## ఆదివాసుల సమస్యలను పరిష్కరించాలి



నవతెలంగాణ-జన్నారం

ఆదివాసుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎస్కే అబ్దుల్లా కోరారు. శనివారం మండలంలోని ధర్మారం అనుబంధ గోండుగూడ గ్రామంలో ఆదివాసి, గిరిజన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి సభ్యత్వం చేసి కార్డులను అందించారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న ఆదివాసి గిరిజన రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితులకు గిరిజనులకు ప్రభుత్వ మూడెకరాల భూమి ఇస్తానని దళిత గిరిజనులను మోసం చేసిందన్నారు. ప్రతి గిరిజన, దళితులకు ఇంటి స్థలంతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఆదివాసులకు ఆదివాసి గిరిజన సంఘం అండగా నిలుస్తోంద పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రణాళికతో చదివి కొలువు సాధించాలి

నవతెలంగాణ-నస్పూర్

ప్రణాళికతో చదివి కొలువు సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి.సంజీవరెడ్డి అన్నారు. సింగరేణి సేవా సమితి శ్రీరాంపూర్ ఏరియా ద్వారా ఎస్సై, కానిస్టేబుల్ దేహదారుఢ్య శిక్షణ తీసుకుని విజయం సాధించిన పురుష అభ్యర్థులు జనరల్ మేనేజర్ కార్యాలయంలో జీఎంను మర్యాదపూర్వకంగా కలిసి సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగాన్ని సాధించడానికి మరొక అడుగు దూరంలో మీరందరూ ఉన్నారని, శ్రీరాంపూర్ ఏరియాలో ఇప్పటివరకు 113 మంది పురుష అభ్యర్థులకు గాను 84 మంది పురుష అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలలో విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. మీరు అందరూ ప్రతిరోజు 18 గంటల వరకు నిరంతరం చదువుతూ మెయిన్స్ వ్రాత పరీక్షల్లో కూడా విజయం సాధించి సంస్థకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఎస్ఓ టు జీఎం త్యాగరాజు, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు అబ్దుల్ ఖాదీర్, డీజీఎం పర్సనల్ పి గోవిందరాజు, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, ఏజెంట్ గోపాల్ సింగ్, ఎస్ఆర్పి3, 3ఏ మేనేజర్ సంతోష్ కుమార్, క్వాలిటీ మేనేజర్ కె.వెంకటేశ్వర్‌రెడ్డి, పర్చేజ్ ఎస్ఈ చంద్రశేఖర్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ హనుమాస్‌గౌడ్, సీనియర్ పీఓ పి.కాంతారావు, జీఎం ఆఫీస్ పిట్ కార్యదర్శి పీవీ రావు, శిక్షకులు సత్యనారాయణ, సురేందర్ పాల్గొన్నారు.




## సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో న్యూఇయర్ వేడకలు

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ కాలనీ, శ్రీరాంపూర్ కాలనీలోని సేవ భవలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం న్యూఇర్ వేడుకలు నిర్వహించారు. సేవా అధ్యక్షురాలు రాధా కుమారి నూతన సంవత్సరం సందర్భముగా కేక్ కట్ చేశారు. సీసీసీ, నస్పూర్‌లోని ఆదిత్య ఉన్నత పాఠశాలలో ఆంగ్ల సంవత్సరాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు రాధా కుమారి మాట్లాడుతూ వృత్తి శిక్షణ కేంద్రంలో వివిధ కోర్సులలో శిక్షణ తీసుకుంటున్న మహిళా అభ్యర్థులు తమ తమ కోర్సులను విజయవంతంగా పూర్తి చేసి నూతన సంవత్సరంలో సొంతంగా వారి వారి యూనిట్లను ప్రారంభించుకొని ఆర్థికంగా వృద్ధి చెందాలని కోరారు. పాఠశాల కరస్పాండెంట్ గోపతి సత్తయ్య మాట్లాడుతూ గతించిన కాలాన్ని మననం చేసుకుంటూ వర్తమానంలో చేయాల్సిన మంచి పనుల గురించి భవిష్యత్తుకు ఎలా పునాదులు వేసుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో సేవా సెక్రటరీ శ్రీమతి కొట్టే జ్యోతి, శారద, సునీత, తిరుమల, రజిత, రమ, భవాని, నిర్మల, జ్యోతి, ప్రదానో పాద్యాయుడు అప్పని తిరుపతి పాల్గొన్నారు.

**రామకృష్ణాపూర్ :** పట్టణంలోని ఎస్ఆర్‌కె పాఠశాలలో శనివారం ముందస్తు నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు కేక్ కట్ చేసి, ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పెద్దపల్లి ఉప్పలయ్య, కోల శ్రీనివాస్, డోకూరి సోమశేఖం పాల్గొన్నారు.

## రౌడీ షీటర్స్ సత్ప్రవర్తనతో మెలగాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు, పలు కేసుల్లో నిందితులుగా ఉన్నవారికి శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్సై బి.అశోక్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారు నేర ప్రవృత్తిని వీడి మంచి ప్రవర్తనతో జీవించాలన్నారు. వారి జీవన విధానంతో పాటు, ప్రస్తుత వారి కుటుంబం స్థితిగతులను గురించి అడిగి తెలుసుకుని, శాంతి భద్రతలకు ప్రజల స్వేచ్ఛ, హక్కులకు భంగం కలిగిస్తూ వారిపై దాడులకు పాల్పడితే సహించేది లేదని, తీరు మారకపోతే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని, రౌడీ షీటర్లపై పీడీ యాక్ట్ పెట్టేందుకు సైతం వెనకాడమన్నారు. ప్రతి 6 నెలలకు ఒక్కసారి చెడు ప్రవర్తన కలిగిన వారిని బైండోవర్ చేయడం వలన వారిపై పోలీస్ నిఘా ఉంటుందని హెచ్చరించారు. బైండోవర్ కాలంలో ఏదైనా నేరంకు పాల్పడినట్లయితే జరిమానాతో పాటుగా జైలు శిక్ష కూడా పడటం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు సత్ప్రవర్తనతో మెలగాలి, చట్టవిరుద్ధంగా పని చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని అన్నారు.

## ఇంద్రవెల్లికి రానున్న రాజేష్‌ని అడ్డుకుంటాం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తన ఉపన్యాసాల్లో హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ హిందూ దేవుళ్ళను కించపరుస్తున్న గాయకుడు రెంజర్ల రాజేష్ ఇంద్రవెల్లి మండలంలో మహర్ వీరుల విజయోత్సవ దివస్‌కు వస్తున్న రాజేష్‌ని అడ్డుకొని తీరుతామని హిందూ వాహిని జిల్లా ఉపధ్యక్షుడు గడ్డల ప్రణయ్ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇటువంటి రాజేష్ అనే పిచ్చి కుక్క ప్రపంచ మేధావి అయిన మహనీయుడు అంబేద్కర్‌ని అడ్డుపెట్టుకొని అంబేద్కర్ వాదం అంటూ హిందూ దేవుళ్ళను ఇష్టం వచ్చినట్టు తిట్టడం సరైనది కాదన్నారు. నాస్తిక సభలు అంటూ కుల మత విద్వేషాలను రెచ్చగొడుతున్న ఇలాంటి వారు ఇంకోసారి హిందువుల మీద కానీ హిందూ దేవుళ్ళ మీద కానీ అనుచితంగా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. అయ్యప్పని కించ పరుస్తూ హిందూ సమాజాన్ని అవమానించిన బైరి నరేష్ నీ పోలీసులు చట్టపరంగా శిక్షించాలని, లేదా నడిరోడ్డు మీద హిందూ వాహిని శిక్ష విధిస్తుందని అన్నారు. సమావేశంలో హిందూ వాహిని గోరక్షక్ సైదం నాగరాజు, మిట్ట శ్రీశైలం, గడ్డల కరణ్, పిప్రే సాయి పాల్గొన్నారు.

## సీనియర్ నెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా స్థాయి సీనియర్ నెట్ బాల్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 2న సోమవారం ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు అలి బిన్ అహ్మద్, జిల్లా సెక్రెటరీ బి.తిరుపతిలు ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక కోసం వచ్చే క్రీడాకారులు రెండవ తేదీన ఉదయం 9 గంటలకు హాజరుకావాలని సూచించారు. క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు రెండు పాస్ ఫోటో సైజులు తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 9949300668 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.